# బాలింతరాలు

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

౧

శ్మశానమే వాగుకి అవతల ఒడ్డున. దానికి ఆనుకునే వుంటుంది ఆ మఱ్ఱిచెట్టు. వాగుకి యివతల ఒడ్డున వున్న ఆ వూళ్లో చచ్చిపోయినవాళ్లందరినీ ఆ శ్మశానంలోనే దహనంచేస్తారు. ఎంతకాలంనుంచి వుంటున్నారో, యింకా ఎంతకాలం వుంటారో ఆ ముసలిచెట్టుకే తెలియాలి కాని, ఎప్పుడు చూసినా దానికింద సాధారణంగా పది పదిహేనుకుటుంబాలికి తక్కు వుండవు. చెట్టుమీద కొండగబ్బిలాలుకూడా వున్నాయి ... ఊడకీ ఊడకీ మధ్య ఏ వాసంముక్కలో, చెట్టుకొమ్మలో రెండు దిగేసి వాటికీ వీటికీ కలిపి తాడూ తంకరాకట్టి, వాటిమీద ఓతాటాకుముక్కో, ఓగోనెగుడ్డపేలికో, చాపముక్కో యిలాంటి వేవో కాస్త అతుకుపెట్టి కట్టి పందిరిలాగా వుండే ఏ గుడిశలాంటిదో తయారుచేస్తారు. వాటిల్లోకి నీళ్లెక్కకుండా కాస్త మెరక చేసుకుంటారు. ఇవే వాళ్ల దివ్యభవనాలు...

చెట్టున్నగట్టూ, ఆ శ్మశానం తప్పితే మిగతా ప్రదేశమంతా పొలాలే... చెట్టుక్రింద వాళ్లుండటానికీ శ్మశానంలో చచ్చినవాళ్లని బూడిద చెయ్యటానికీ వీలుగా వుండటానికిగాను సాగుచెయ్యకుండా విడిచిపెట్టారు ఆ ప్రదేశాన్ని... అక్కడుండేవాళ్లు ఫలాని తెగవాళ్లనిగానీ వాళ్లది ఫలానావృత్తి అనిగాని చెప్పటానికి వీల్లేదు. సాధారణంగా ముసలివాళ్లూ, చిన్నపిల్లలూ ఊళ్లో ముష్టెత్తుకుంటారు. దొరికితే కూలికెడుతారు పడుచువాళ్లు. ఆడవాళ్లు కొంతమంది సోది చెబుతారు. పాముల్ని పట్టేవాళ్లుకూడా ఒకరిద్దరున్నారు. దువ్వెన్నలూ, సబ్బుబిళ్లలూ, దారపుండలూ లాంటివి యింటింటికీ తిరిగి అమ్ముకునే ఆడవాళ్లు కూడా కొంతమందున్నారు. పొలాల్లోకి ఆలస్యంగా నీళ్లెక్కినా లేకపోతే ఏదన్నా ఎద్దడి వచ్చినా ఎప్పుడన్నా రైతులు వీళ్లని ఊడ్పులికీ కోతలికీ పిలవటం కూడా కద్దు. పంటకోసి కుప్పలేసినా, కుప్పలునూర్చి రాసిపోసినా అక్కడ మొక్క మొలిచిపోవాలి, తప్పితే ఒక్కగడ్డిపరకన్నా పోదని ఆ చుట్టుపట్ల మహాప్రఖ్యాతి. అంతనమ్మకం ఆ చెట్టుక్రిందవాళ్లంటే. అంతకన్నా విచిత్రం: ధాన్యపురాసులికి కాపలాకాసేదే వాళ్లు!! ఊళ్లో పెద్దమనుష్యులు షికారొచ్చినప్పుడు చెట్టుకింద వాళ్లని చూసి "వాళ్లదే హాయైన బతుకు, చీకూ చింతా లేదు" అంటారు.

౨

అతనికి ముప్పైఅయిదేళ్లుంటాయి. కాస్త లేతవయస్సులోనే పెళ్లి చేసుకున్నాడు. పెళ్లైన రెండో ఏటే, ఓపిల్లాడు పుట్టి నెల తిరక్కముందే పోయాడు. తరవాత మళ్లా సంతానమే లేదు పది పదిహేనేళ్లవరకూను... ఇప్పుడు భార్యకి పురుడొచ్చే రోజులు. ఇద్దరికీ అబ్బరంగానే వుంది. కోతల్లో నాలుగు డబ్బులు మిగుల్చుకుని పెళ్లానికి కొరబ్బాంది పలుకులూ అవీ కొనిపెడుతూ ఒచ్చాడుకూడాను ... ఇవాళో రేపో పురుడొచ్చేట్టున్నా పొట్ట గడవదు గనుక పాపం అతను పెద్దరైతు రాసిమీద నాలుగు రోజులు కాపలాకి కుదురుకున్నాడు. బంధువులు సాయం రావటం మూలాన రైతురాసి అంతా రెండు రోజుల్లోనే కొట్లల్లోకి జేరింది. కాపలాకాసే నిర్భాగ్యుడికీ సంగతి ముందరే తెలిసి ఆ తెల్లారికట్లనే ముసిముసి చీకట్లో రాసిలోంచి, రెండు మరకాలగింజలు మూట కట్టుకు చక్కాబోయాడు. నాలుగురోజులు కాపలా వుంటే ఆ కూలి గింజల్తో పురుడు వెళ్లేదాకా ఎలాగో ప్రాణాలు నిలుపుకోవచ్చునని పాపం అతని ఉద్దేశం;

కాని రెండు రోజుల్లోనే పని అయి పోవటం చేత కక్కుర్తిపడి సాహసం చేశాడు యింత పెద్ద రాసిలో రెండు మరకాలు తక్కువైతే కనుక్కో ఒచ్చారా అని. దొంగతనం యింకోతనం బయట పడక మానదంటుంది ప్రపంచం. ఆ చెట్టుకింద వాళ్లే ఎవరో ఊదారు రైతు చెవిలో. పట్టుపట్టని అతన్నిలాక్కొచ్చి స్తంభానికి రెక్కలు విరిచికట్టి, ఆ చెట్టుక్రింద వాళ్ల చేతనే కఱ్ఱలతో బాదించారు పెద్దలు. "తరతరాల్నుంచీ ఎంతో నమ్మకంతో కాపలాకాస్తున్నారు. ఈ నాటికి పుట్టాడు. ఈ చిత్తకార్తి కుండా కొడుకు......" అన్నారు అంతాను... భార్యస్థితి తలుచుకోటంచేత దిగజారిన అతనిగుండె లా దెబ్బలికె తాళుకో లేక పోయాయి. మొన్నాటికి ఒళ్లంతా ఉబ్బినట్టైంది. మూడోనాడు తెల్లారేసరికి శరీర మంతానల్లపడింది... పురుగు ముట్టడంచేత పోయా డన్నారు అంతాను. అప్పుడే ప్రసవించిన భార్యకి తెలుసు ఎందుకు పోయాడో... ఆ చెట్టు క్రిందున్నవాళ్లని శాశ్వతంగా దారిద్ర్యంలో వుంచే శుద్ధ సత్వానికి 3౫ ఏళ్ల యువకుడి వేడినెత్తురు బలిధారలు!

## 3

భార్య యిప్పుడు బాగా ముసలిదైపోయింది పురుట్లో సూతికజ్వరం రావటంచేతా, తరవాత తరవాత మనోవ్యాధితోనూ బాగా క్షీణించిపోయి, పిల్లకి మూడోఏడు ఒచ్చేసరికే తల్లికి పక్షవాతం ఒచ్చింది. దాంతోటి మూతి ఎడంవేపుకి బాగా వంకర తిరిగిపోయింది. ఎడంకాలు భూమిమీద అసలు ఆననే ఆనదు. ఎడంచెయ్యి ఆఖరికి పైట సవిరించుకుంటానికూడా పనికి రానంతగా పడిపోయింది. ఓ కన్నుకూడా కిందికి వాలిపోవటం మూలాన చూసే వాళ్లకి మహా వికృతంగా కనిపిస్తుంది. నోట్లో పైవరస నోపన్నూ, కిందివరసను రెండుపళ్లూ మాత్రం ఉన్నాయి. తలంతా నెరిసిపోయినట్టే. పైట వేసుకుంటే మొలకి చుట్టుకుంటానికి సరిపోదు గనకనూ, ముసలిదీ, అందులో ఒళ్లంతా ఎండిపోయింది కనకనూ మొలకిమాత్రమే ఓ గుడ్డచుట్టి వుంటుంది. ౨౦ ఏళ్లకంటే ఎక్కువ వుండక పోయినా యీ మాయదారి రోగంవల్ల ౪౦, ౪౫ ఏళ్లదల్లే కనిపిస్తుంది. ఆ వెదురు కర్ర ఎంతబలం కలదైనా ముసిల్దాని చేతిలోనే ఎంతకాలం నుంచో అణిగి వుంది...

కూతురు కిప్పుడిరవై ఏళ్లుంటాయి. పుట్టినప్పుడు పచ్చగానే వుండేదట. రానురాను చామన చాయైంది. ఇప్పుడు నల్లగా వుంటుందనే చెప్పాలి. కొంచెం పెద్ద కళ్లు. ముక్కుదూలం ఆట్టే నిడివిగా వుండదుగాని, చివరమాత్రం కాస్త కొస తేలి వుంటుంది. గడ్డంమధ్య చిన్నసొట్ట. వసివాడిన ముదురు తమలపాకులల్లే చెంపలు అదోమోస్తరుగా వుంటాయి. చిన్నప్పుడే పొడిపించిన పచ్చ, మడ్డి పట్టిన మొహంమీద బాగా కనిపించదు. జుట్టు ముడేసినప్పటికీ కొన్ని వెంట్రుకలు రేగి, గుబురుగా చెవుల్ని కప్పేస్తూ వుంటాయి. తల్లిమాదిరిగానే మోకాళ్లవరకూ వచ్చేది మొలకో గుడ్డ చుట్టుకుంటుంది. ముసలితనం రాలేదుగనక, ఒళ్లుదాచుకునేందుకు ఇంకో గుడ్డ పేలికలాంటిది మొలలోంచి దోపి, గుండెలమీదుగా, ఎడమభుజంనుంచి మెడచుట్టూ తిప్పి మెళ్లో వున్న గోగునార తాడుకి ముడేసుకుంటుంది. చేతులికి రంగుతాళ్లు గాజులు మాదిరిగా చుట్టుకుంటుంది. కుడిచేతిలో కుండ పెంకు పట్టుకుని ఎడం చెయ్యి అమ్మభుజంమీద వేసి, తన ఉరోభాగాన్ని అమ్మ శరీరానికి చాటు చేసుకుని నెమ్మదిగా యింటింటికీ అడుక్కుంటూ వెడుతుంది......కాలూ చెయ్యీ ఉన్ననాటి తల్లిగుర్తు ఆ అమ్మాయికి లేనేలేదు. తల్లంటే మహా ప్రేమ కూతురికి. అమ్మ గనకనే కాకుండా అవిటిదనీ, తనుతప్ప వేరే దిక్కు లేదనీని. ముష్టిగింజల్తో ఎలాగో ప్రాణం నిలుపుకుంటున్నా గుడ్డకి మాత్రం మహా యిబ్బందిగా వుండేది. అందులో చలికాలంలో మరీని. పగలు అడుక్కున్న బియ్యపుగింజలు శవాల్ని కాల్చగా మిగిలిపడున్న కట్టెలతోనో, పిడకల్తోనో ఓ బొచ్చులో కాస్త ఉడకేసుకు తింటారు రాత్రిళ్లు. ఎత్తుకున్న మధూకరపు మెతుకులు, చెరో రెండూ నోట్లో వేసుకొని, యిన్ని నీళ్లు తాగి, మఱ్ఱిచెట్టుకి తూర్పువేపున వున్న ఆ రెండున్నరగజాల మెరకమీదా అమ్మని కావిలించుకొని తన పమిటగుడ్డ తీసేసి, చాలీ చాలకుండానే, యిద్దరికీ కలిపి కప్పుకుని, ఆమెగుండెల్లోకి తలదూర్చి పడుకుంటుంది కూతురు....

అప్పుడప్పుడు ముసిల్ది చెబుతూవుంటుంది తన చిన్నప్పటిగాథ. వాళ్లమ్మ పుట్టినదికూడా అక్కడేట. ఓరోజు, చెట్టు నరుకుతూండగా పిడుగుపడి అకస్మాత్తుగా నడివయస్సులోనే చచ్చిపోయాడుట మొగుడు. పిల్లలు లేకపోవటంమూలాన, ఏ నాలుగిళ్లడుక్కున్నా, లేకపోతే, ఏ కోతగింజలు దాచుకున్నా, ఓమోస్తరుగా వెళ్లిపోతోంది. ఓరోజు, తూర్పార పొయ్యటానికి ధాన్యం అందిచ్చి, పొద్దూకువేళకి, చెంగుమాయటంచేత, కొస్త ఆలస్యంగా, చెట్టుక్రింది కొస్తుంటే, దార్లో పొలంఖామందు, అటకాయించి బలవంతపెట్టాడుట. కాళ్లావేళ్లా పడి ఎంతబతిమాలుకున్నా, భయపెట్టినా, ఏంలెక్కచెయ్యకుండా, మరీ పశువల్లే, మీద పడబోతుంటే చెంగుమాసిం దన్నా... 'నీళ్లరోజు నొస్తా'...నందిట తప్పించుకుంటానికని. ఆయనా కొస్త ఆలోచించి......'నిజమేనా ?...సరే ...నీమాట నమ్ముతున్నా. మీవాళ్లల్లో అబద్ధమాడటం యింతవరకూ లేదు'... అని విడిచిపెట్టాడు. నాలుగోరోజు సాయింత్రానికి, రాసిలో బెడ్డ ఏరాలని ప్రత్యేకం పని పెట్టి పిలిపించాడు. నిజమే ననుకుని వెళ్లింది. తీరా చూస్తే పొలంమీద రాసేలేదు. ఖిక్కుఖిక్కుమంటూ, వెనక్కి తిరిగేసరికి, మీసాలు దువ్వుకుంటూ, వాము పక్కనుంచి, పొలంఖామందు..."నేను కూడా ఏరుకుందామని ఒచ్చా..." నంటూ నవ్వుతూ అమాంతం కుడిచెయ్యి పట్టుకున్నాడు. గుండెగుభేలుమంది పాపం. చెయ్యి విదిలించుకుని పరిగెత్తి కళ్లంవెనక్కి, తప్పుకుంది. చెంగున దూకాడు మీదికి, 'నీళ్లనా డొస్తానని నువ్వే చెప్పావుగా మరి ?...' అంటూను. అరవటానికన్నా వీల్లేకుండా నోట్లో గుడ్డలు కుక్కేశాడు. చేతులూకాళ్లూ విదిలించికొట్టింది. ఏంచేస్తే ఏంలాభం? ఏనుగంత మగమనిషితో, పిట్టలాంటి ఆడది ఎంతసేపని పోట్లాడగలదు? అలిసిపోయి మొహం తేలవేసింది. తన మానరక్షణ కేమీ అవకాశం లేదు. ఒక్కక్షణం ఆలోచించి, నోట్లోగుడ్డలు తీసెయ్యమని సంజ్ఞ చేసింది. 'అల్లారా...దార్లోకి...' అంటూ తీసేశాడు. లేచి అతనిచెయ్యి పట్టుకొని గొడ్లసావిట్లోకి తీసుకుపోయింది. అతనికే ఆశ్చర్యంగానే వుంది. అప్పుడే ఒస్తున్న వెన్నెట్లో పాక వెనకపక్క ఆరుబయట కొత్త నులకమంచం వుంది .........!! ఇదివర కెప్పుడూ అబద్ధమాడలేదు ఆమె. ఇప్పుడూ ఆడనట్టే! అదే తృప్తి......

మొదట్లో ఒకటిరెండు నెలలు, మానెడూ, అడ్డెడూ గింజలు కొలుస్తూ వుండేవాడు. తరవాత తరవాత అసలు మొహం చూపటమే మానేశాడు,... కార్తీక మాసంలో పురుడొచ్చింది... జోరున వాన కురుస్తుండగా పిల్ల బైటపడటం, తల్లి పరమపదించటం ఒక్కమాటే జరిగిపోయాయిట....

ఈకథ చెబుతూంటే చెవులు దోరబెట్టుకుని వింటూ, తల్లిచెబుతున్న గుర్తులతో అమ్మమ్మ రూపాన్ని తనమనస్సులో చిత్రించుకుంటానికి ప్రయత్నిస్తూ, ఏవో దీర్ఘాలోచనల్లో మునిగి మునిగి, ఆఖరికి నిద్రపోయేది, చెమర్చినకళ్లు తుడుచుకుని ఆ అమ్మాయి... అమ్మమ్మప్రాణం పోసుకుని అమ్మ పుట్టింది ... తనో ?...

"నాన్నేడీ?" అని చిన్నతనంలో, మాటలొచ్చి రానప్పుడడిగితే "సముద్రందాటి వెళ్లాడనీ...తరవాత ఒస్తా"డనీ చెప్పేది తల్లి. రానురాను పిల్లకికూడా తెలిసింది పెద్దరైతు పొలానికి కాపాలాపెట్టడం, రెండు మరకాల గింజలు చెప్పకుండా తీసుకురావటం, రెక్కలు విరిచి స్తంభానికి కట్టి కొట్టించడం, పురుగుముట్టడంచేత చచ్చాడని అందరూ అనడం అదీని... ఇప్పుడారైతు పెద్ద షాహుకారైపోయాడు. మొన్నిమధ్య రెండు బియ్యపుమరలుకూడా కట్టించాడాయన పెద్దకొడుకు. ముష్టికెళ్లేటప్పుడు వాళ్లింటిదగ్గి రాగేది కాదు ముసిల్ది. మొదట్లో కూతురికి తెలిసిందికాదు కారణం. "వాళ్లు వెయ్యరమ్మా" అంటూ వుండేది తల్లి నడిగితే. విషయం తెలిసిన తర్వాత తనే ఆగేది కాదు. ఏదోపిచ్చిగాని యీ ముష్టి ముండ లా యింట్లో ముష్టి తీసుకోకపోతే వాళ్లకొచ్చిన నష్టమేమిటి ?...

## ౪

పుష్యమాసం ఊహూ చలిగాలి వేస్తోంది విశ్వమంతా గడ్డకట్టుకుపోతుందా అనిపించేట్టు. సూర్యుడు

కూడా బిగుసుకు పోతున్నాడు చలికి. పొద్దున్నే ౬ గంటలికి నిద్రలేచిందా అమ్మాయి. చలిచేత ఒళ్లు వణికిపోతున్నా ఎలాగో చేతులూ జుట్టూ కప్పుకుని, తల్లికి కాస్త వెచ్చగా వుండాలని తనపైటగుడ్డ కప్పి కాలకృత్యాలు తీర్చుకుంటానికి వెళ్లింది. తిరిగి వచ్చి "ఎండపొడలో పడుకుందుగాని లే అమ్మా..." అంటూ తట్టిలేపింది తల్లిని, మొహంమీదిగుడ్డ తప్పిస్తూను. ఒళ్లు మంచుగడ్డల్లే తగిలింది చేతికి......'నాయనోయ్'...అని పెద్దకేకేసి తల్లి మీద పడిపోయింది... చెట్టుకిందివాళ్లంతా చుట్టూ జేరారు. ఏముందీ?... అక్కడేగా శ్మశానం !

౫

సూదంటురాయి యినుమును ఆకర్షించకుండా వుండలేదు. మానవహృదయం ప్రేమించకుండా వుండలేదు. తాను ఓ వస్తువును ప్రేమించి, తన దానినిగా చేసుకుని తన్నుదాంట్లో ఐక్యంచేసి దివ్యానందాన్ని పొందటానికి ప్రయత్నిస్తుంది. ఇనుము ఎదట వున్నప్పుడే ఆకర్షిస్తుంది సూదంటురాయి. ప్రాణశక్తి వున్న మానవహృదయం తాను ప్రేమించదగిన వస్తువుకోసం ప్రపంచ మంతా గాలిస్తుంది ఆ వస్తువు లభించేదాకా శాంతి వుండదు. లభించిన ఆ వస్తువు నశించిపోతే తాను కూడా నశించటంకద్దు. ఒక్కొక్కప్పుడలా చచ్చిపోలేకపోతే ఆ స్థానం ఆక్రమించగల మరో వస్తువుకోసం వెతుక్కుంటుంది. ఆ వస్తువు చైతన్యరహితమైనదికూడా కావచ్చు. కొన్ని సందర్భాల్లో ఓ ఆదర్శాన్ని నిర్మించుకుని, దానికి సంపూర్ణంగా అధీన మౌతుంది మానవహృదయం. భగవద్భక్తికూడా అలాంటిదే... మాతాసుత ప్రేమలోనూ, భార్యాభర్తల ప్రేమలోనూ, భక్తి ఆత్మసమర్పణ సిద్ధాంతాల్లోనూ యీ తత్వమే అంతర్వాహినిగా పరిగెడుతూ వుంటుంది. తెలిసినా తెలీకపోయినా ప్రతిమానవహృదయం చేసేపనీ యిదే.

ఆ అమ్మాయికూడా హృదయం వుంది. అది ప్రేమించగలదు. ప్రేమించి తీరాలి. ప్రేమించింది అవిటితల్లిని, ఏ కూతురూ ఏ తల్లినీ ప్రేమించనంత గాఢంగా. అమ్మ ప్రీతిలత కూతురి ప్రేమవల్లికతో పెనవేసుకుని, ముడివడి, ఏకత్వాన్ని పొంది అమరసుఖాన్ని కలిగించింది. ఆ అనుభూతిలో చిరిగిపోయిన తన గుడ్డపేలికలుగాని, ఎండిపోయిన ఎముకల రోదనగాని, ఆరిపోయిన గుండెల ఆర్పులుగాని, అరుస్తున్న పేగుల మోతలుగాని కనిపించలేదు, వినిపించలేదు. ఇప్పుడా దివ్యగ్రంథిలోని ఒకతీగ ఎండి రాలిపోయింది. రెండవదానికిహ స్థావరం ఎక్కడ? కాని ఆమె అధీరహృదయ కాదు. రాలిపోయిన ప్రీతిలత ఆమెప్రాణాన్ని బలి తీసుకోలేదు. ప్రేమానుభూతిలోంచి దొర్లిపోయిన ఆ యువతిని చింకి పేలికలు ఆకలిమంట నాలికలై ఎండుటెముకల్ని కాల్చెయ్యటం మొదలెట్టాయి. చక్కబరచబడిన ఆర్థికస్థితి ఆమెహృదయ వేదనకి జవాబు కాకపోవచ్చు. కాని సాధనమాత్రం కాకపోదు... అందుకైనా అవకాశం ఏదీ? ఊరుబైట శ్మశానం దగ్గిర, కొండగబ్బిలా లుండే మఱ్ఱిచెట్టుకింద తూర్పు భాగపు మెరకమీద 'నా' అనేవాళ్లు లేని ఓ పక్షిలాంటి బీదమనిషి, తనప్రేమ నిధానమైన తల్లి మరణిస్తే, హృదయవేదనతో పిచ్చెక్కి కృశించిపోతోందనీ, దాన్ని ఉద్ధరించమనీ పరిగెత్తుకుపోతున్న యీ ప్రపంచానికి చెప్పే దెవరు? ఓ వేళ చెప్పేవారున్నా వినిపించుకునే దెవరు?... కాని తను ప్రేమించదగినదై, తన్ను ప్రేమించే వస్తువు దొరికితే?... అచేతనమైన వస్తువునిగాని, ఆదర్శాన్నిగాని ప్రేమించటము ఆమెకి తేలీదు. ఆమె జ్ఞానీకాదు, చదువుకోనూ లేదు. ఇహ దేన్ని ప్రేమించాలి? ఏమో ఆమెకే తెలీదు. దుర్భరమైన వ్యథగా వుంది. లక్ష్యరహితమైన, ఆమెప్రేమహృదయాన్ని రూపంలేని నగ్న విచారాలు కోసేస్తున్నాయి.

౬

పుచ్చపువ్వులాంటి విదియవెన్నెల ఎముకల చూర్ణం ఆరబోసినట్టుగావుంది. చేలు యీనే రోజులవి. వాగుమీది తరంగాల్లో వెన్నెలలు ప్రతిఫలిస్తూ పొర్లిపోతున్నాయి. గట్టుపక్కని చేలల్లోంచి పచ్చిక వాసనలు చంద్రకిరణాల్లో తేలుతూ, వాగులోని వెండి తరంగాలమీదుగా అవతలిగట్టు దాటి ఊళ్లో కెళ్తు

తున్నాయి. మబ్బుతునకలు నల్ల ముసుగుల్తో కప్పేస్తే, అంచుల్లోంచి తొంగిచూస్తూ, ముసుగులు తీసేసినపుడు కిలకిలా నవ్వుతూ, యవ్వనమదంతో తల లూగిస్తున్న చేలకి చక్కిలిగింతలు పెడుతూ ఆడుకుంటున్నాడు చంద్రుడు. ఎదట వున్న ఊరు, కృత్రిమదీపాల మూలాన అసలు కనిపించటమే లేదు. కాస్తదూరంగా అవతలి ఒడ్డున వున్న ఆ మఱ్ఱిచెట్టు వెన్నెల వెలుగుల్లో విస్పష్టంగా కనిపిస్తున్నా, ఊడల నీడల్లో మనుష్యులు మాత్రం కనపడీ కనపడకుండా వున్నారు.

వాగులో మొహం కడుక్కుని పైటచెంగుతో తుడుచుకుంటూనే నడుస్తోంది గట్టంబటే ఆ అమ్మాయి. ఏమిటో అనేక భావాలు! మనస్సుమాత్రం నిశ్చలంగా లేదు. ఓనాడు ఆ పాపాయిని ముద్దెట్టుకుంటుంటే పని కుదురుకున్న యింటావిడ చటుక్కున వచ్చి "అల్లా నలిపేస్తా వేమిటే పిల్లాడిని?" అంటూ పిల్లాడిని లాక్కుపోవటం తను గుడ్ల నీళ్లు గుడ్ల కుక్కుకుని "నాకుమాత్రం తెలీదుటండీ" అనడం, ఆ అమ్మాయి కళ్లల్లో మెదుల్తున్నాయి. తనది కానప్పుడు ఒచ్చేచిక్కే అది... చంద్రుడికేసి చూస్తూ యిందాకటినుంచీ తుడుచుకుంటూనేవుంది మొహం పరధ్యానంగా. మరీ తుంటరిగా, పమిట తొలిగిన ఆమెవక్షంలోకి తొంగి తొంగి చూస్తున్నాడు చంద్రుడు మబ్బుతెరల్ని చాటు చేసుకుని. వాగుమీదినుంచి ఒచ్చేలేతగాలి సందులుచేసి చంద్రుడికి తోడ్పడుతోంది... సౌందర్యం చాటున తెలీకుండానే హత్యలు జరుగుతూంటాయి... చంద్రుడి పక్కనుంచే ప్రేతకళతో దిగిపోయిన నక్షత్రం వెన్నెలమూలాన ఆమెకి కనిపించనేలేదు.

ఎదురుగుండా ఒస్తున్న షాహుకారుగారి రెండో అబ్బాయి నామె అసలు చూడనే లేదు. అతనుమాత్రం దూరంనుంచే గమనించాడు ఎవరో వస్తున్నట్టు. వెన్నెల పరుగుల్లో విస్పష్టంగా కనిపిస్తున్న ఆమె తీరు, యవ్వనం లోవున్న అతణ్ని మోహపెట్టింది. అతన్నే కాదు, ఉప్పుపులుసూ తింటున్న ఎవరినైనా మోహపెట్టేదే ఆదృశ్యం. అకస్మాత్తుగా గజంన్నర దూరంలో పరాయి పడుచువాడిని ఎదురుగా చూసేసరికి ఆ అమ్మాయిగుండెలు ఝల్లుమన్నాయి. చచ్చిపోయిన తల్లీ, తల్లి చెప్పే అమ్మమ్మకథా, అర్థం కాని ఆవేదన పొందుతూన్న తనహృదయం, తాను పని చేస్తున్న యింట్లో, ఆ పాపాయిని తను ముద్దెట్టుకుంటుంటే ఆవిడ కోప్పడటం, తన యవ్వనం, బీదరికం, వెన్నెలలో ప్రకృతిశోభ, రాత్రివేళ, ఎదట డబ్బుగల అందమైన యువకుడూ, ఏకాంతం.... ఏమిటో భావాలూ ఎన్నోదృశ్యాలూ, ఒక్కమాటుగా ఆ అమ్మాయి కళ్లనీ హృదయాన్నీ ముంచెత్తి కలవర పరిచాయి. ఆ కలవర పాటుని ప్రతిఫలింపజేస్తున్న ఆమె నల్లకళ్లు, అతణ్ణి మరీ ముగ్ధుణ్ణిచేశాయి. తను ధనికుడూ. ఆమె బీదదీ. ఆమె నేం చేసినా సంఘం నోరుమూసుకునే కూర్చుంటుందని అతనికి బాగా తెలుసు. నిర్భయంగా మీదికొచ్చి, పమిటలేని ఆమె కుడిభుజంమీద చెయ్యి వేశాడు... ఇంతవరకూ సెగల్లుగా మండు తున్న ఆమె హృదయకుండంలో ఓ అమృతపుచుక్క వేసి నట్టయింది... ఆమె ప్రతిఘటించలేదు... చిన్నవంతెన మీదుగా వాగుదాటారు. దక్షిణంవేపు చేలో పాతగడ్డివామి యింకా అయిపోలేదు. నీళ్లుతాగిన పచ్చిక సువాసనలతో కలిసిపోయిన ఎండుగడ్డి గుమాయింపుల్లో ఎన్నిగంటలు గడిచిపోయాయో...

కావిలించుకుంటూ నని చెపుతూ, తన కాలహస్తాల్తో చంద్రుడి గొంతు ఓ మాటు నులిమేసి విడిచిపెట్టింది మేఘం.

## ౨

తరవాత ఊళ్లో అతను రెండుసార్లు కనిపిస్తే, సిగ్గుచేత తలొంచుకు వెళ్లిపోయింది. మూడోమాటు ఓ రోజు, మసిమసిచీకట్లో పని కెళ్లుతున్నప్పుడు, పెద్ద వీధిపక్క సందులో, అతను కనిపించాడు ఒక్కడూను. ఇదివరకు పలకరించకపోయినందుకే అనుమానపడుతున్న ఆ అమ్మాయి, యిప్పుడన్నా మాట్లాడిస్తాడేమోనని కాస్త నిమ్మదిగా అడుగు లేసింది. దులపరించుకు వెళ్లిపోయాడతను. అవమానం భరించలేక, సిగ్గుమళ్లించుకుని, రెండడుగులు వెనక్కివేసి, ఆవేదనతో తడబడుతూ... 'దొరగారూ' అంది. అతను వెనక్కి తిరిగన్నా చూడలేదు...

## ౮

అక్కడ పని మానుకున్న తరవాత, వేరే దొరక లేదు. అదీగాక నెలలుకూడా వచ్చాయి. రెక్కలాడటం మానగానే డొక్కలు మాడటం మొదలెట్టాయి. పైగా అవమానభారం. క్రమంగా నీరసించి క్షీణించి పోయింది. అందులోనూ వేసంకాలంమూలాన మరీ ఒచ్చింది. ముష్టి అడుక్కునే ఓపికకూడా సన్నగిలింది. ఓపూట తినీ, ఓపూట తినకానూ. శారీరకంగా ఎంత కష్టపడుతున్నా, మానసికక్షోభమటుకు లేదు. తాను చేసిన పనికి మొదట్లో చింతించింది, తన నిష్కళంక హృదయం ఓమాటు, ఓ స్వార్థపరుడైన పాశవికకాముకుడి కఠోరస్పర్శకి ఆకరం అయినందుకుగాను. కాని తాను శాశ్వతంగా ప్రేమించ దగిన వస్తువుని, తన వినిర్మలమానాన్ని బలిచ్చి నిర్మించుకో గలిగినందుకు, ఆమె తన అమాయకత్వాన్నే మెచ్చుకుంటూ ఒచ్చింది తరవాత తరవాత. ఆ వస్తు సందర్శనంకోసం ఆమె మనస్సు తహతహలాడిపోతోంది. ఈతహతహలో ఆమె దారిద్ర్యం బాధించ గలిగినంత ఎక్కువగా వేధించలేకపోయింది.

## ౯

జ్యేష్ఠమాసం సగం వెళ్లిపోయింది. బహుళ పాడ్యమి నాడు అరుణోదయం అవుతుండగా ఒచ్చింది పురుడు. మొగపిల్లాడు. మువ్వెన్నలూ, సబ్బులూ అమ్ముకునే ఓ ముసలమ్మ, బొడ్డుకోసి వెళ్లింది. రెండురోజుల్నించీ పడిన మరణవేదన ఆమె కేమీ లెక్క అనిపించలేదు. తనప్రేమనిధానాన్ని చూసుకుని స్వర్గసుఖం అనుభవించింది. నీరసించిన గుండెల్లో, తన ఆశాజ్యోతిని అదుముకుని...నా...నాన్న... అని ఎండు పెదిమెల్తో గొణుక్కుంటూ, పొంగులుపోయే తీపిచూపుల్తో పిల్లాడిని ఒక్కమాటు ముంచేసి, తలనిమురుతూ, బలహీనం చేత కళ్లు మూసుకుంది... పాలివ్వటానికి పిల్లాడిని యింకా దగ్గిరికి తీసుకుని, తాగటం వాడికి చేతకాక పోతే, తనే రెండుచుక్కలు పిండింది నోట్లోకి. ఏమిటో ధన్యత! ఎంతో ఆనందం!! అమ్మ ఉన్నప్పుడు, అమ్మా తనూ ఒకళ్లనొకళ్లు కావిలించుకుని అమ్మమ్మకథ చెప్పుకుంటూ పడుకునే నాటి దివ్యానందానుభూతి మళ్లా జ్ఞప్తికి వచ్చింది...

## ౧౦

ఉదయంపూటే వెచ్చదనం కనిపించింది గాలిలో. పొద్దెక్కిన కొద్దీ గాలిలో వుండేనీళ్లు బీదవాడి ఒంట్లో నెత్తురు మాదిరిగా ఇగిరిపోవటం మొదలెట్టింది. పదకొండుగంటలు దాటిపోయింది. వడగాడ్పు ఝుమాయించి కొడుతోంది. మూడోరోజు పురుడొచ్చి. బాలింతరాలి గొంతులో యిన్ని పచ్చి మంచినీళ్లు పోసిన పాపాన్నా పోలే దెవరూను. పాపం, ఆ ముసలమ్మ పుణ్యామా అంటూ బొడ్డుకోసి వెళ్లింది. తప్పితే ఏంచెయ్యగలదు? తనకుంటేగదా యితరుల మాట చూసేది? ఆకలి నకనకలాడిపోతోంది బాలింతరాలికి. పిల్లాడిపని మరీ యిదిగా వుంది. మొదటి రెండురోజులు నాలుగుపాలచుక్కలతో వెళ్లమారిపోయింది కాని యివాళ ఆ చుక్కలుకూడా లేవు తల్లిదగ్గిర. ఊహలూ కక్కటిల్లి పోతున్నాడు. శోష ఒస్తుందేమోనని భయంగా వుంది. కాస్త అలవాటవడంచేత తల్లి ఎదురొమ్ములో తన బుల్లి మూతితో వెతుక్కుని చన్నుకరిచాడు. కాని ఏంప్రయోజనం? ఏడ్చేడ్చి సొమ్మసిల్లి పోయాడు. తల్లిగుండె చెరువై పోయింది. ఆదుర్దాగా లేచి, పిల్లాడిని ఒళ్లో తీసుకుని, వాడినోట్లో ఎడంరొమ్ము పెట్టి నొక్కింది దారుణమైన బాధసహిస్తూ. ఆమెప్రాణా లవిసిపోయాయి. ఇంకో నొక్కు... చనుమొనను నెత్తురు చిమ్మింది... తనబాధ కేంగాని పిల్లాడింకా సొమ్మసిలే పడున్నాడు. శరీరపు మూలల్లో ఎక్కడోవున్న కాస్తప్రాణాన్నికూడ దీసుకు చిక్కబట్టుకుని పక్క కెళ్లి అప్పుడే ముష్టెత్తుకుని తిరిగి ఒచ్చిన ఓ గుడ్డివాడిబొచ్చెలోంచి రెండు చద్దిమెతుకులు అడిగితెచ్చి యిన్నినీళ్లల్లో పిసికి పిండి, పిల్లాడినోట్లో పోసింది. వాడుకాస్త యిటు కదిలేసరికి ఆమెప్రాణాలు లేచొచ్చాయి. 'నాతండ్రే' అంటూ ఒక్కమాటు గుండె కదుముకుని పడుకోబెట్టింది.

రెండు ఝాములు తిరిగింది. ఇనపసూదులు కాల్చి గుచ్చుతున్నట్టుగా వున్నాయి సూర్యకిరణాలు.

కనకనలాడే నిప్పుబొగ్గులు నోట్లో పోసుకుని యముడు ఊదుతున్నాడా అనిపిస్తోంది వడగాడ్పు. మచ్చుకైనా లేవు ఆకాశాన ఆఖరికి తెల్లమబ్బు ముక్కలైనా. నీలాంబరంలో కాలపాశపుచుట్టల్లే కూచుని చూస్తున్నాడు సూర్యుడు, తన ప్రతాపానికి ప్రపంచం ఏమంటోందో అని. రెండయ్యేసరికి చెట్లాకులన్నీ మలమలా మాడిపోయాయి. లేతరెమ్మలు కాలిపోయినట్టుగా నల్లబడ్డాయి కూడాను. చెట్లమీదినుంచి ఉడతపిల్లలు చచ్చి ఠపీమని పల్లగిత్తులుగా కింద పడిపోతున్నాయి. కొమ్మల సందుల్లో యిరుక్కున్న పక్షుల శవాలికి అంతే లేదు...

పిల్లాడు మళ్లా ఏడుపు సాగించాడు. తన ప్రాణం కూడా యిటూ అటూ అన్నట్టుగా వుంది. ఏం చెయ్యటానికీ తోచక గాభరాగా వాడిని ఒళ్లో వేసుకుని చరచరా బయలుదేరింది వూళ్లోకి, మళ్లీ శోష రాకముందు రెండు మెతుకులెక్కడన్నా అడుక్కొచ్చి నీళ్లల్లో పిండిపోద్దామని. కాల్చిన యినపపాడి మాదిరి భగభగమంటున్న ఆ గండ్ర యిసకలోంచి వెళ్లి వాగు దాటి వూరుమొగదలలోకి ఒచ్చింది... ఎదురుగానే నాలిక వెళ్లబెట్టుకుని మూతి నేలకి కొట్టుకుని చచ్చిపడుంది ఓ తెల్లకుక్క పిల్ల వీధిమధ్యగా. బాలింతరాలిగుండెలు గుభేలుమన్నాయి. మాటిమాటికీ పిల్లాడిని స్పృశించి చూస్తూ బాగా గుడ్డ కప్పేసి తనపైకి పమిటకూడా లేకుండా, పిచ్చెత్తినదాని మోస్తరుగా అంగలు జాస్తూ ఒక్కయింటి తలుపన్నా తీసివుంటుందేమో నని బహు ఆత్రంగా వీధికి రెండువేపులా పరిశీలిస్తూ తొందరపాటుతో పదిగజాలు నడిచింది. ఓ యింట్లోంచి యింకో యింట్లో కెడుదామని ప్రహారీగోడ తూములోంచి బయటికొచ్చిన ఓ మచ్చల పిల్లి రోడ్డు అవతలి కెళ్లకముందే గిర్రున తిరిగి పడిపోయి నెత్తురు కక్కుకుంది.

బాలింతరాలికళ్లు చీకట్లు కమ్మాయి అంత వెలుగున్నా. కన్నీళ్లు కార్చటానిక్కూడా శక్తిలేదు. మృత్యుముఖంలో బిగుసుకుపోయిన ఆ జీవాలికి అదృష్టవశాత్తూ ఒక్క ఆధారం దొరికింది. కుడివేపు వరసలో మాత్రం ఓ యింటితలుపు ఓరవాకిలిగా వేసివుంది. మొహం యింత చేసుకుని,ఆ అమ్మాయి ఆ ఇంటిముందు కెళ్ళి, ఎండిన నాలుకతో, ఆరిపోయిన పెదిమెల్ని తడుపుకుంటానికి ప్రయత్నం చేస్తూ, ఒణికిపోతున్న బలహీనస్వరంలో "బాలింతరాల్ని తల్లీ, ఒక్క మెతుకేయించు మా అమ్మా!" అని కేకేసింది. నాలుగేళ్ల పిల్లాడూ, ఆరేళ్లపిల్లా ఆ యింటిసావిట్లో ఆడుకుంటున్న వాళ్లల్లే యీ కేక విని, గుమ్మందగ్గిరికొచ్చి, తలుపు యింకా కాస్త తెరిచి కమ్మలు పట్టుకునే నుంచుని..."పాపాయేడీ? చూపించు" అన్నారు. ...చూపిస్తాతల్లీ! 'యింత ముద్దెయ్యమని అమ్మగారితో చెప్పమ్మా...పాలులేక చచ్చి—' ఆ మాటనలేక "పాలు లేవు నాయనా మూడురోజుల్నించీ" అంది బాలింతరాలు ఆత్రంగా.

"జొతే మరి అన్నం ఎందుకూ?" అందాపిల్ల.

"...చూడు...చూడు. మరీ నీ... చెవుల్లో దూదిలేదేం ? మా బుల్లక్కయ్యకూడా పెట్టుకుంది పాపాయి పుట్టినప్పుడు" అన్నాడా అబ్బాయి.

"...ఛీ! ముష్టివాళ్లెక్కడన్నా చెవుల్లో దూది పెట్టుకుంటూ రుట్రా?" అం దాపిల్ల. చిన్నప్పుడే తెలుస్తుంది కొమాలు వాళ్లకి, ముష్టివాళ్లు మనుష్యులు కారని. మళ్లా ఆపిల్లకే సందేహం ఒచ్చి "జొతే, మరి నడికట్టేసుకో లేదేం?" అని ప్రశ్నించింది.

ఈ ప్రశ్నలికి సమాధానం చెప్పేమనస్థిమితం ఎక్కడిది బాలింతరాలికి?

"గుడ్డలేదమ్మా"అని ఏదో సమాధానం చెప్తూ ఎక్కడో వున్న కాస్త ప్రాణాన్ని చెదిరిపోకుండా మళ్లా కూడదీసుకుని, లోపలివాళ్లకి వినబడేటట్టు కొంచెం బిగ్గిరిగా..."బాలింతరాల్ని తల్లీ... ఒక్క చద్దిముద్దే యించమ్మా..." అంది గొంతుకోసిన నల్లమేక చివరి అరుపుమాదిరిగా. ఈ అరుపుకి, లోపలున్న యిల్లాలు చర్రున లేచి సావిట్లో కొచ్చి చూచేసరికి, ఆపిల్లలిద్దరూ బాలింతరాలితో రాచుకుంటున్నంత గ్గిరగా మాట్లాడటం కనిపించింది. మొగపిల్లాడు అరుగు

చివరగా నంచుని బాలింతరాలి ఒళ్లోకి తొంగి చూస్తూ..."అదిగో నేవ్ అక్కయ్యోయి! పాపాయి చెయ్యి... ఎంతబుల్లిదో చూడు, చూడు... పిలుస్తున్నాడే నిన్ను...రమ్మని..." అంటున్నాడు. తమ్ముడున్న స్థానంలో నంచుంటేగాని పాపాయి కనబడదు గనక "నువ్వు కొంచెం వెనక్కి రారా... నేను చూస్తాను" అని తమ్ముడితో అంటోంది చెయ్యి లాగుతూను ఆడపిల్ల. ఆ చల్లనితల్లి పిల్లల్నిద్దర్నీ చెరోచరుపూ చరిచి, "ఛీ... భడవాముండా! పురిటిలంజవి నావాకిట్లో కొచ్చావా? ఛో! నిక్షేపంలాగా ఆడుకుంటున్న పిల్లల్ని ఎండలోకి రప్పించావ్!" అని పిల్లల వేపు తిరిగి "అమ్మో! అమ్మో! ఎంత ఎండ! ఎంత ఎండ! సావిడితలుపు తీశారుటే? పోండి లోపలికి అంటూ వాళ్లని లోపలి కీడ్చుకెళ్లింది. భగ్నహృదయంతో "తల్లీ నీ పాదాలికి మొక్కుతా నాయమ్మ... నీకడుపు చల్లగా, పిల్లలగన్న మాతల్లీ! మూడు రోజుల్నించీ తిండిలేదు... రెండు మెతుకులేయించి ప్రాణాలు నిలుపు మా రాణీ... నీ చెప్పులు మోస్తా... పిల్లాడినాలిక పిడచకట్టి పోయింది నాయమ్మ..."అని చెయ్యి నేల కానించి, మొహాని కద్దుకుంటూ అడిగింది బాలింతరాలు.

"ఛీ...రంకుముండా, ఒళ్లు మదించి, అడ్డమైనవాళ్లతోనూ పోయి, పిల్లల్ని కని, ఊరుమీద పడుతారు మహా తాతసొమ్మేమో దాచుకున్నట్టు. నీతా? జాతా?...ఛో..." అంటూ ఆ యిల్లాలు తలుపు తప్పీమని వేసింది. ఇంటినిండా గంపెడు పిల్లలు. వేసీ వెయ్యకుండా యింత వుందికూడాను. ౧౫ ఏళ్లుంటాయి. పోయినవాళ్లు పోను నలుగు రాడపిల్లలూ ఆరుగురు మొగపిల్లలూను. కడసారి వాడికి మొన్ననే మూడో ఏడొచ్చింది...

తప్పీమని వేసిన తలుపు వడగాలివిసురుకి, మళ్లీ వెనక్కి తన్నడంమూలాన, పాపం ఆ యిల్లాలి మొహానికి తగిలి కాస్త బొప్పి కట్టింది. దాంతోటి ఆవిడ మహాంకాళి అయిపోయింది. ఆ గాడ్పుకి బాలింతరాలి ఒళ్లోవున్న పసివాడు కెవ్వున కేకేశాడు. గాలి గూబలోంచి, కాల్చిన బాణంమాదిరిగా దూసుకుపోవటం చేత, బాలింతరాలు తూలిపోయింది. కాని ఎలాగో అరుసమొత్త పట్టుకుని, నిలదొక్కుకుంది. అరిచిన పసివాడు, మళ్లీ కదలకపోయేసరికి, తల్లి ప్రాణా లెగిరిపోయాయి..."కాసిని మంచినీళ్లన్నా పోయించు తల్లీ, పిల్లాడు...కదలటంలే దమ్మో..." అని బావురుమంది పాపం!

"నీమొహం మండ! ఏమి వగలే? పొద్దున్నే ఎవరిమొహం చూశానోగాని, మొహమంతా బొప్పికట్టింది—నీమూలాన. నీపిల్లాడూ, నువ్వూ పెద్దగంగలో పడి అణగారిపోనూ! చావండి, నాశనం కండి ఎండలో పడి..."అని, తలుపు జాగ్రత్తగా నొక్కి, మళ్లీ వెనక్కి రాకుండా గడియవేసింది. కిటికీల్లోంచి అక్కాతమ్ముళ్లూ పాపాయికోసం యింకా చూస్తునే వున్నారు.

ఎండించి, కాల్చి, మాడ్చేసి, చిత్రవధ చెయ్యటం జరుగుతూంటుంది సంఘంలో, ఓవ్యక్తిని సంఘమంతా కలిసో; ఓ వ్యక్తి సంఘాన్నంతానో; లేకపోతే ఓతెగ యింకో తెగనో. కృశించి కాలిపోయే గుండెల పొగలూ, నీరసించి ఎగిరిపోయే ప్రాణాల అరుపులూ ఏమి ఆనందాన్నిస్తాయో ఆ వ్యవస్థకి!

మళ్లా అల్లాంటిదే యింకోగాడ్పు...ఒళ్లో ఉన్న పసిపాప, చిట్టచివరిమాటుగా యింకో ప్రళయనాదం పలికించాడు... దానిక్కూడా జవాబు లేదు. చెవిటి సంఘంయొక్క రాతిసందెల్లో చొరబడే శక్తి ఆ ఆర్తనాదానికి లేదు... మరుక్షణంలో ఒళ్లో ఉన్నబిడ్డ మంచు గడ్డయిపోయాడు. అప్పటికే మహాప్రస్థాన సన్నాహంలో వున్న బాలింతరాలిప్రాణాలు ఆ చల్లదనాన్నిమాత్రం గ్రహించ గలిగాయి. "నాయనోయి"... అన్న ఆమె అంతిమనినాదం వీథంతా ప్రతిధ్వనించింది. సుడితిరిగి గిర్రున పడిపోయిన ఆమెశిరస్సు వీధి అంచున కంకరముక్కలమీద ఆనింది. ఒళ్లో ఉన్న పిల్లాడికలా, ఓ చెయ్యిమాత్రం దుమ్ములో దొర్లుతున్నాయి. మిగతా శరీరభాగం యింకా తల్లిఒళ్లోనే వుంది...

ఆ యింటి రెండో అంతస్తులో అప్పుడే భార్య యిచ్చిన చల్లటి పానీయాన్ని సేవిస్తున్న సాహుకారుగారి రెండోకొడుకు బాలింతరాలి ఘోషకి అదిరిపడి లేచి, వెండిచెంచా చేతులో పట్టుకునే, కిటికీ తెర ఒత్తిగించి క్రిందికి చూశాడు. భార్యకూడా... "ఏమిటా అరుపు?..." అంటూ భర్తని అనుసరించింది. తలదిమ్మ కాస్త తిరిగి కళ్లు తెరిచిన బాలింతరాలికి, కిటికీలోంచి చూస్తున్న భార్యాభర్తలు కనిపించారు. ఆమెకళ్లల్లోంచి సాహుకారుగారి రెండో కొడుకు కళ్లల్లోకి బలవత్తరమైన ఓ అదృశ్యప్రవాహం పరిగెత్తింది. దాంట్లో సర్వసృష్టినీ భస్మీపటలం చేసే కాలాగ్నులున్నాయో? ప్రేమాంబుధిలో ముంచి లేవనిస్తే పీయూషధార లున్నాయో? కాని అతడు తనకళ్లకి వెండిచెంచా అడ్డంపెట్టుకుని ప్రవాహాన్ని కట్టెయ్యడం మూలాన, అది బాలింతరాలి కళ్లల్లోనే యిసర్చుకు పోయింది. ఆమెనేత్రాలికి అమరాచ్ఛాదనం వేసిన వెండిచెంచాని భార్యకిస్తూ, చెమటలుపట్టిన దేహంతో నీళ్లుకమ్మిన కళ్లల్లోంచి, కాకివాలిన పసిపిల్లాడి మొహంలోకి చూశాడు సాహుకారుగారి రెండో కొడుకు!

---

# రిక్తగీతి

శ్రీ అబ్బూరి వరదరాజేశ్వరరావు

---

అచట నెత్తుటఁ బడిన దే యధమజనుని
చివికి చిల్లులు వడిన దస్థికల బోను ?
అచటి నెత్తుటిలోన యే హస్తముద్ర
మూగినజనమ్ము గుండెల ముగ్ధపరచె ?

ఎవరి దీయాకృతి ? తను నశించె; ఈ య
గాధలోకమ్ము చెరసాల గడచి పోయె
తనకు నా యనువా రున్న దరికి రారు
ఎట్టి పాపిష్ఠిజన్మ జీవించినాడొ ?

అతనిమోము నెత్తుటిముద్ద; ఆ యభాగ్య
జీవనమ్ము నెవరిపాలు చేసి చనెనో ?
ఏ మధురస్వప్నభూముల నెవరికొరకు
చెడుగురాచరికపు కళ్లబడి నశించె !

మనవి పేదగుండెలు; ఝల్లు మనును; చూచి
చూచి నిల్చిన నేను చచ్చువడిపోయి
కాలు కదపని యీపాపఘడియలోన
ఆతపత్రమ్మువోలె నల్లాడినాడ !

ఏ యనంతాశయఫలిత మ్మీ యఖండ
త్యాగశీలమ్ము ? ఏపవిత్రానుబంధ
మేచికొన్నదో యితని దిక్కేని లేని
చావు, మా మానవత్వమ్మె సడలిపోవ !

---